RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 436 | 30 గురువారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

నిజం మా నిబద్ధత... ప్రజా ప్రయోజనం మా ధ్యేయం...

ది హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

ప్రతి ఇంటికి... ప్రతి చేతికి... నిజమైన వార్తలు

మా దినపత్రిక విస్తరణలో భాగంగా

రిపోర్టర్లు కావలెను!

జర్నలిజంపై ఆసక్తి కలిగిన, నిజాయితీ గల, సమాజంపై స్పందన కలిగిన అభ్యర్థులు మా బలమైన బృందంలో చేరండి.

> స్టాపర్లు (స్ట్రింగర్లు)
> మండల రిపోర్టర్లు
> జిల్లా బ్యూరోస్

అన్ని నియోజక వర్గాలలో కావలెను

సంప్రదించవలసిన నెంబర్: 9951693876

ఎడిటర్ లక్ష్మీనారాయణ

## బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఎప్పటికీ

# క్షమాపణ చెప్పను

## : రాహుల్ గాంధీ




లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరాకరించారు. జంతర్‌మంతర్‌లో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేయడంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాత్ర ఉందన్న ఆరోపణలను మరోసారి పునరుద్ఘాటించారు. "అమిత్ షానే ఆదేశాలు ఇచ్చి ఉండాలి.. లేకపోతే ఏం జరుగుతోందో ఆయనకు తెలియకపోయి ఉండాలి" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ సమావేశం వాయిదా పడిన తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు.

క్షమాపణ చెబితే ప్రసంగం కొనసాగించేందుకు అవకాశం ఇస్తామని తనకు చెప్పారని, కానీ బీజేపీకి, ఆర్ఎస్ఎస్‌కు తాను ఎప్పటికీ క్షమాపణ చెప్పబోనని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా దేశానికి సంబంధించిన కీలక అంశాలను లేవనెత్తే హక్కు తనకు ఉందని అన్నారు.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడారని రాహుల్ ఆరోపించారు. ఒక విద్యార్థి కంటి చూపు కోల్పోయే పరిస్థితి వచ్చిందని, దీనికి సంబంధించిన ఎయిమ్స్ వైద్య నివేదికను తాను చూశానని చెప్పారు. మేకులున్న లాఠీలు, షాక్ బ్యాటన్లతో మహిళలు, మైనర్లపై కూడా దాడులు చేశారని ఆరోపించారు. నిరసన సమయంలో అమిత్ షా పోలీసు అధికారులతో మాట్లాడడం తాను స్వయంగా చూశానని కూడా పేర్కొన్నారు.

ఆ తర్వాత జితేంద్ర సింగ్ కు అమిత్ షా నుంచి వరుసగా కాల్స్ వచ్చాయని అన్నారు. అంతకుముందు లోక్‌సభలో రాహుల్ చేసిన ఆరోపణలపై అధికార పక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలకు ఆధారాలు చూపాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు.

స్పీకర్ ఓం బిర్లా కూడా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయొద్దని సూచించారు. మరోవైపు రాహుల్ ఆరోపణలను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పూర్తిగా ఖండించారు. నిరసనల సమయంలో కాల్పులు జరగలేదని, అలాంటి ఆదేశాలు కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు.

## రేవంత్, కిషన్ రెడ్డి కారణంగా సింగరేణి అస్తిత్వం

# ప్రమాదంలో పడింది

## : కవిత



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిల తీరు వల్ల తెలంగాణకే గర్వకారణమైన సింగరేణి సంస్థ తన అస్తిత్వాన్ని, ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాకులను కేటాయించాలన్న విజ్ఞప్తులను పట్టించుకోకుండా... మణుగూరు పీకేవోసీపీ (ఝఖూజా) బొగ్గు బ్లాక్ వేలం నిర్వహించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. సింగరేణి నేరుగా వేలంలో పాల్గొంటుందని పైకి ప్రకటించిన ప్రభుత్వం, తెరవెనుక మాత్రం టీఎస్ జెన్‌కోను పోటీలోకి తెచ్చేలా కుట్రపూరిత ప్రయత్నాలు చేస్తోందని కవిత మండిపడ్డారు. బొగ్గు తవ్వకాల్లో శతాబ్దాల అనుభవం, ప్రావీణ్యం ఉన్న సింగరేణి సంస్థకు పోటీగా.. ఎలాంటి అనుభవం లేని టీఎస్ జెన్‌కోను రేసులోకి దింపడం వెనుక ఉన్న మర్మమేమిటో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జెన్‌కో ద్వారా బొగ్గు బ్లాకులను దక్కించుకుని, ఆ తర్వాత అనుభవం లేదనే నెపంతో వాటిని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ఈ ముసుగు డ్రామా ఆడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. సింగరేణి భవిష్యత్తు, అభివృద్ధిపై కిషన్ రెడ్డికి నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, వేలం ప్రక్రియతో సంబంధం లేకుండా నేరుగా కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ వేలం పోటీ నుంచి టీఎస్ జెన్‌కోను రాష్ట్ర ప్రభుత్వం తప్పించాలని డిమాండ్ చేశారు.

# కంగనా రనౌత్ క్షమాపణ చెప్పాలి

## : సీపీఐ నారాయణ



కంగనా రనౌత్ అవమానకర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. నారాయణ మండిపడ్డారు. తన వ్యాఖ్యలతో సమాజంలో భావోద్వేగాలను దెబ్బతీసిన కంగన... బాధితులైన యువతకు, మహిళలకు బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా జీవితంలో, ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాలను వెల్లడించేటప్పుడు సంయమనం, బాధ్యత వహించాలని నారాయణ సూచించారు. సమాజంలో విభేదాలను పెంచి, ప్రజాస్వామ్య విలువలను కాలరాసేలా కంగనా మాట్లాడటం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇదే క్రమంలో... గతంలో నిరసనకారులను ఉద్దేశించి చేసిన 'బొద్దింకలు' అనే వ్యాఖ్యల పట్ల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించి, ఆ వ్యాఖ్యల వల్ల కలిగిన భావోద్వేగ బాధను గుర్తించి సరిదిద్దుకునే ప్రయత్నం చేయడాన్ని నారాయణ అభినందించారు. తప్పును గుర్తించి దిద్దుకునే ఇటువంటి వైఖరి న్యాయ వ్యవస్థ గొప్పతనాన్ని, ఉన్నతమైన సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని అన్నారు.

## రేవంత్ రెడ్డి ఉన్నారనే ధీమాతోనే ఆంధ్ర రైతులు


# పంటలు వేసుకుంటున్నారు

## : నిరంజన్ రెడ్డి



ఎల్‌నినో ప్రతికూల ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమకు నీళు ఇస్తారనే ధీమాతోనే ఆంధ్రప్రదేశ్ రైతులు పంటలు సాగు చేస్తున్నారని బీఆర్ఎస్ జాతీయ కార్యదర్శి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డిలతో కలసి ఈరోజు జూరాల ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఆత్మకూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి స్థానిక కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేయకుండా తెలంగాణ రైతులను గోస పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. "రేవంత్ రెడ్డి ఎట్లయినా సరే ఆంధ్రకు నీళ్ల తరలిస్తారన్న ముందస్తు నమ్మకంతోనే అక్కడి రైతులు ధైర్యంగా విత్తనాలు వేసుకుంటున్నారు" అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రికి ఏపీ ప్రజలపై ఉన్న ప్రేమ, ఇక్కడి తెలంగాణ రైతాంగంపై లేదనడానికి జూరాల కాలువల నిర్లక్ష్యమే నిదర్శనమని నిరంజన్ రెడ్డి దుయ్యబట్టారు.

# ఆంధ్రప్రదేశ్‌కు వర్ష సూచన



ఉరుముల సమయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచన

ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) వెల్లడించింది. కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లుల పడటంతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం, కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో పాటు గాలులు బలంగా వీస్తున్నప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చెట్ల కింద, భారీ హోర్డింగుల సమీపంలో నిలబడకూడదని, తెగిపడిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

# ముందస్తుగా గుర్తిద్దాం.. క్యాన్సర్‌ను జయిద్దాం : హరీశ్ రావు

వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయించుకోవడం కంటే, రాకముందే గుర్తించి నివారించుకోవడం ఉత్తమ మార్గం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రారంభ దశలో గుర్తింపే క్యాన్సర్‌పై విజయానికి కీలకం అన్నారు. సిద్ధిపేటలోని విపంచి ఆడిటోరియంలో సింధూ హాస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్న 2 రోజుల ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని హరీశ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఆరోగ్యం కంటే గొప్ప సంపద మరొకటి లేదని, వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స కంటే ముందుగానే గుర్తించి నివారించుకోవడం ఎంతో ముఖ్యమని అన్నారు. క్యాన్సర్‌కు భయపడాల్సిన అవసరం లేదని, ప్రారంభ దశలో గుర్తిస్తే అనేక రకాల క్యాన్సర్లను పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. ముఖ్యంగా 40 సంవత్సరాలు దాటిన మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. కేన్సర్ వ్యాధితో కుటుంబాలు అన్ని రకాలుగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మారిన జీవనశైలి ఆహారపు అలవాట్లు క్యాన్సర్ కేసుల పెరుగుదలకు కారణమవుతున్నాయి అన్నారు.

ఈ శిబిరంలో నిర్వహిస్తున్న మామోగ్రామ్, పాప్ స్మియర్ వంటి పరీక్షలు సాధారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చవుతాయని, ఇక్కడ మాత్రం పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ప్రతి మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని హరీశ్ రావు కోరారు. పొగాకు, గుట్కా, పాన్ మసాలా వంటి అలవాట్లు నోటి క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని పేర్కొంటూ, అలాంటి అలవాట్లను కుటుంబ సభ్యులకు మాన్పించే బాధ్యత అందరిదని హరీశ్ రావు అన్నారు.

మహిళ ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది..బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, జిల్లాల వారీగా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో ఆధునిక వైద్య సేవలు, 'ఆరోగ్య మహిళ' వంటి కార్యక్రమాలను అమలు చేసిందని హరీశ్ రావు గుర్తు చేశారు. ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే



ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది. ఒక కుటుంబం ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుంది. అందుకే మహిళల ఆరోగ్య పరిరక్షణకు మేము ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు కూడా నాణ్యమైన వైద్య సేవలు పొందాలనే ఉద్దేశంతో సింధూ హాస్పిటల్ సహకారంతో ఈ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 'స్వచ్ఛ సిద్ధిపేటతోపాటు హెల్తీ సిద్ధిపేట కూడా మన లక్ష్యం కావాలి. ప్రతి ఇంట్లో ఉన్న మహిళలను ఈ శిబిరానికి తీసుకువచ్చి ఉచిత పరీక్షలు చేయించండి. ఒక చిన్న పరీక్ష ప్రాణాలను కాపాడగలదు' అని హరీశ్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన హైదరాబాద్ సింధూ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, నిర్వాహకులకు హరీశ్ రావుకృతజ్ఞతలు తెలిపారు.

## సంక్షేమ పథకాలకు, ఓటర్ల జాబితా సవరణకు

# సంబంధం లేదు

## : తెలంగాణ సీఈఓ




రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, ప్రస్తుతం కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. తప్పులు లేని కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ఏకైక లక్ష్యమని ఆయన వివరించారు. బుధవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఫారాల సమర్పణకు మరో ఐదు రోజులే గడువు ఉన్నందున, ఆగస్టు 3వ తేదీ నాటికి 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 76 శాతం డిజిటలైజేషన్ పూర్తి కాగా, గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రక్రియ 90 శాతానికి చేరిందని తెలిపారు. ఖానాపూర్, బాలకొండ, ఎల్లారెడ్డి, హుజూర్‌నగర్, నర్సంపేట, వర్ధన్నపేట, పరకాల, బోథ్ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేసిన అధికారులను ఆయన అభినందించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం వంటి పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించారు. ఓటరు వివరాలను అప్‌లోడ్ చేసే సమయంలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), సూపర్‌వైజర్లు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరినీ ఒకే పోలింగ్ కేంద్రానికి కేటాయించాలని, అలాగే మరణించినా లేదా చిరునామా మారిన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేటప్పుడు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సీఈఓ స్పష్టం చేశారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## ఎగుమతుల దిశగా రంగారెడ్డి జిల్లా అడుగులు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 29:- రంగారెడ్డి జిల్లాలోని పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరేలా ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో జిల్లా కలెక్టరేట్‌లో జూలై 30న ఉదయం 10 గంటలకు మెగా ఎగుమతి ప్రోత్సాహక సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి వెల్లడించారు. జిల్లా స్థాయిలో ఎగుమతులను పెంపొందించే “జిల్లా ఎగుమతుల కేంద్రం“ కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విదేశీ వాణిజ్య విభాగం అధికారుల సమన్వయంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ, వాణిజ్య శాఖ, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ, నాబార్డ్, ఎగుమతి రుణ హామీ సంస్థ, భారత తపాలా శాఖతో పాటు పలువురు నిపుణులు పాల్గొని పారిశ్రామికవేత్తలకు మార్గనిర్దేశం చేయనున్నారు. ఎగుమతులకు సంబంధించిన ప్రభుత్వ ప్రోత్సాహకాలు, విదేశీ మార్కెట్లలో వ్యాపార అవకాశాలు, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక సదుపాయాలు, ఆన్‌లైన్ వాణిజ్య విస్తరణ, ఎగుమతి ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. అలాగే ఎగుమతులు ప్రారంభించాలనుకునే వారికి దిగుమతిఎగుమతి కోడ్ పొందే విధానం, అవసరమైన పత్రాల సమర్పణ, దరఖాస్తు ప్రక్రియపై ప్రత్యక్ష సహాయం అందించనున్నారు.జిల్లాలోని పరిశ్రమల యజమానులు, నూతన పారిశ్రామికవేత్తలు, మహిళా వ్యాపారవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, స్టార్టప్ సంస్థలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సదస్సు ద్వారా స్థానిక ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌కు చేరేందుకు అవసరమైన అవగాహన, ప్రోత్సాహం లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఆదిభట్ల టౌన్ ప్లానింగ్‌లో గుట్టుగా ఏం జరుగుతోంది..?



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 29:- రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్, తొర్రూర్ ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భవన నిర్మాణ అనుమతుల జారీ, వాటి వినియోగ మార్పుల విషయంలో నిబంధనలు పూర్తిగా అమలవుతున్నాయా అనే సందేహాలు స్థానికుల్లో నెలకొన్నాయి. ముఖ్యంగా ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పేరుతో కొందరు వ్యక్తులు అనధికార జోక్యం చేసుకుంటూ నిర్మాణదారుల నుంచి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. రెసిడెన్షియల్ అనుమతులతో నిర్మించిన భవనాలు తర్వాత వాణిజ్య అవసరాలకు ఉపయోగించినా ఎలాంటి అభ్యంతరం ఉండదంటూ కొందరు తప్పుడు హామీలు ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారాల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి నష్టం వాటిల్లుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే ఈ అంశాలపై మాజీ ప్రజాప్రతినిధులు కూడా బహిరంగంగా ప్రశ్నలు లేవనెత్తడంతో పూర్తి స్థాయి విచారణకు డిమాండ్ మరింత పెరిగింది. భవన అనుమతుల మంజూరు నుంచి వినియోగ మార్పులు, రుసుముల వసూళ్ల వరకు ప్రతి అంశాన్ని సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణల్లో నిజం ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు టౌన్ ప్లానింగ్ వ్యవస్థలో పారదర్శకతను మరింత బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## చైన్ స్నాచర్ల ముఠా అరెస్ట్..

### 8 తులాల బంగారం స్వాధీనం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 29:- రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ డీసీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఇటీవల వెలుగు చూసిన చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు వేగంగా ఛేదించినట్లు వెల్లడించారు. ఈ నెల 24న కేశంపేట మండలం సంతాపూర్, కద్తాల్ ప్రాంతాల్లో ఇద్దరు మహిళల మెడల నుంచి బంగారు గొలుసులు లాక్కెళ్లిన ఘటనలపై కేసులు నమోదు చేసి, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను కేశంపేట సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అరెస్టైన ఇద్దరు నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారని, వరి కోత యంత్రాల పనుల కోసం తరచూ షాద్‌నగర్ పరిసరాలకు వచ్చి, తిరుగు ప్రయాణానికి ముందు చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. వీరు వినియోగించిన మోటార్‌సైకిల్ మహబూబ్‌నగర్ ప్రాంతంలో దొంగిలించిందని, స్వాధీనం చేసుకున్న ఐదు మొబైల్ ఫోన్లు రైళ్లలో చోరీ చేసినవిగా గుర్తించామని తెలిపారు. మరో నిందితుడు పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు కొనసాగుతోందన్నారు. నిందితుల వద్ద నుంచి 8 తులాల బంగారం, ఒక మోటార్‌సైకిల్, ఐదు మొబైల్ ఫోన్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణతో పాటు సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణలో ప్రశ్నపత్రాల లీక్ ఘటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి



హైదరాబాద్, జులై 29: తెలంగాణలో దశాబ్ద కాలంలో జరిగిన ప్రశ్నపత్రాల లీక్ ఘటనలపై సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ లోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నీట్ పత్రాల లీక్ కు బాధ్యత వహించి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో ప్రశ్న పత్రాల లీక్ ఘటనలపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## గురు పౌర్ణమి వేళ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు మాజీ ఎమ్మెల్యే

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 29:- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గురు పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కొంగర కలాన్‌లోని ప్రముఖ శ్రీశ్రీశ్రీ సాయిబాబా దేవాలయంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) ప్రత్యేక పూజల్లో పాల్గొని శ్రీ సాయినాథుని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వారు భక్తిశ్రద్ధలతో పాల్గొని రాష్ట్ర ప్రజలతో పాటు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గురువుల ఆశీస్సులు ప్రతి ఒక్కరి జీవితంలో సద్బుద్ధి, విజయాలు, శాంతి, సౌభాగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. అలాగే శ్రీ సాయిబాబా కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి సాయిబాబా ఆశీస్సులు పొందారు.



## వీరనారుల సంక్షేమానికి వీర రత్న ఫౌండేషన్ చేయూత



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 29:- హైదరాబాద్‌లోని సోమాజిగూడ సైనిక్ ఆరామ్ ఘర్‌లో తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ సహకారంతో వీర రత్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీరనారుల మహిళా సాధికారత, సంక్షేమంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల సిబ్బంది కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీరనారులు, వారి కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు, వాటిని పొందే విధానం, భవిష్యత్ కార్యక్రమాలు, సంస్థ లక్ష్యాలు, విలువలపై ప్రతినిధి దీప్తి శర్మ సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 30 మంది వీరనారులు, కుటుంబ సభ్యులు పాల్గొని పథకాలపై అవగాహన పొందారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు మాట్లాడుతూ, వీరనారుల సామాజిక, ఆర్థిక సాధికారత కోసం వీర రత్న ఫౌండేషన్ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు వారి జీవితాల్లో మరింత భరోసా కల్పించడంతో పాటు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సేవలను చేరువ చేస్తాయని పేర్కొన్నారు. వీరనారులు, వారి కుటుంబాల సంక్షేమానికి సైనిక సంక్షేమ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఆరుట్ల టీపీఎస్‌లో స్ఫూర్తి జ్వాల

### - విద్యార్థుల్లో లక్ష్యసాధనకు ఇన్‌స్పైర్-2026







హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 29:- మంచాల మండలం ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో గురుపూర్ణిమ సందర్భంగా నిర్వహించిన “ఇన్‌స్పైర్-2026“ కార్యక్రమం విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. మల్‌రెడ్డి యువశక్తి ఆధ్వర్యంలో మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఏసీపీ కె.వి. రాజు తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆకెళ్ల రాఘవేంద్ర గంటన్నరపాటు సాగిన ప్రేరణాత్మక ప్రసంగంతో విద్యార్థులను ఆకట్టుకున్నారు. లక్ష్యసాధన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమయపాలన వంటి అంశాలను సులభమైన ఉదాహరణలతో వివరించి విద్యార్థుల్లో ఆలోచన రేకెత్తించారు. ఆయన ప్రతి సందేశానికి విద్యార్థులు చప్పట్లతో స్పందించగా సభా ప్రాంగణం ఉత్సాహంతో మార్మోగింది. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గురుపూర్ణిమ సందర్భంగా పాఠశాలకు చెందిన 60 మందికి పైగా ఉపాధ్యాయులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే రెండు వేల మందికి పైగా విద్యార్థులకు జ్యామెట్రీ బాక్సులు, వాటర్ బాటిళ్లు తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేసి ప్రోత్సహించారు.కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి విద్యార్థులతో కలిసి పాఠశాల భోజనశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ గురించి తెలుసుకుని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రతిరోజూ పౌష్టికాహారం అందించాలని ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌కు సూచించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో స్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో విజయవంతమైందని పలువురు అభిప్రాయపడ్డారు.

## గురుపౌర్ణమి సందర్భంగా సాయినగర్ సాయిబాబా మందిరంలో మహా అన్నదానం



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ హనుమకొండ: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ సాయినగర్‌లోని శ్రీ షిర్డీ సాయి సేవా సమాజ్ ఆధ్వర్యంలో జూలై 29న మహా అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, సాయి సేవా సమాజ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సార్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ తుంగతుర్తి శేషగిరిరావు వరలక్ష్మి దంపతులు, సాయి నిఖిత, సాయి మాన్విత, మౌర్య శశాంక్ తదితరుల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయిబాబా భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.ఈ సందర్భంగా శ్రీ షిర్డీ సాయి సేవా సమాజ్ సభ్యులు, సాయినగర్, హనుమకొండ మాట్లాడుతూ, గురుపౌర్ణమి పర్వదినాన అన్నదానం చేయడం ద్వారా సాయిబాబా సేవలో భాగస్వాములు కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. “అన్నదానం మహాదానం“ అనే స్ఫూర్తితో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులకు సేవ చేయడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.

శ్రీ సాయినాథుని ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతి, సౌభాగ్యాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన దాతలు, భక్తులు, సేవా సమాజ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కృష్ణమూర్తి ఆరోగ్యంపై తహసీల్దార్ ఆరా

### – త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన రియాజుద్దీన్



గీసుకొండ, జూలై 29 హైదరాబాద్ ఎస్టేట్: ఈనాడు దినపత్రిక సీనియర్ రిపోర్టర్ కోల కృష్ణమూర్తి ఆరోగ్య పరిస్థితిని గీసుకొండ తహసీల్దార్ యం.డి. రియాజుద్దీన్ అడిగి తెలుసుకున్నారు. ఆయనను ఆత్మీయంగా పరామర్శించి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రియాజుద్దీన్ కోల కృష్ణమూర్తితో మాట్లాడి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు అందిస్తున్న సేవలను గుర్తు చేస్తూ, ఆయన ఆరోగ్యం మెరుగుపడి తిరిగి తన విధుల్లో కొనసాగాలని ఆకాంక్షించారు. జర్నలిజం రంగంలో తనదైన గుర్తింపు పొందిన కోల కృష్ణమూర్తి త్వరగా కోలుకోవాలని పలువురు జర్నలిస్టులు, సన్నిహితులు ఆకాంక్షించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
30 గురువారం జూలై 2026



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హనుమకొండ, జూలై 29

బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారిపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ డీసీసీ భవన్‌లో కాంగ్రెస్ మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం చెప్పుకోదగ్గ చర్యలు చేపట్టలేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ముస్లింల సమస్యలను పట్టించుకోని వారు, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం మైనారిటీల పేరును వినియోగిస్తున్నారని ఆరోపించారు.


ప్రస్తుత ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముస్లింల ఖబ్రస్తాన్ కోసం మూడు ఎకరాల భూమిని, క్రైస్తవుల శ్మశానవాటిక కోసం మరో మూడు ఎకరాల భూమిని కేటాయించారని తెలిపారు. కేవలం భూమి కేటాయించడమే కాకుండా, ఆ ప్రాంతాన్ని పూర్తిగా అభివృద్ధి చేసి రహదారి, ప్రహరీ గోడ, గేటు వంటి సౌకర్యాలతో అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని వెల్లడించారు.

అలాగే ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చినా అమలు చేయలేదని ఇస్మాయిల్ విమర్శించారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, మైనారిటీల అభివృద్ధికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ఉద్యమకారిణి రహీమున్నిస బేగం మాట్లాడుతూ, గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముస్లింల అవసరాలను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. షాదీఖానా కోసం భూమి కోరినప్పటికీ సరైన స్పందన లభించలేదని, గతంలో కేటాయించిన స్థలాన్ని కూడా రద్దు చేశారని అన్నారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత షాదీఖానా నిర్మాణం కోసం భూమిని కేటాయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. మైనారిటీ నాయకులు మాట్లాడుతూ, సర్వే నంబర్ 579లో 25 గుంటల స్థలాన్ని షాదీఖానా కోసం కేటాయించిన సమయంలో, ఆ స్థలం అనుకూలంగా లేదని అప్పటి మైనారిటీ సంక్షేమ అధికారి మరో స్థలాన్ని కేటాయించాలని కోరడంతో జిల్లా కలెక్టర్ ఆ కేటాయింపును రద్దు చేశారని తెలిపారు. అనంతరం ఈ విషయం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి దృష్టికి రావడంతో వెంటనే స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి రద్దు చేసిన స్థలాన్ని తిరిగి పునరుద్ధరింపజేసి, దానికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీఓ) జారీ చేయించారని వెల్లడించారు.

ఈ మొత్తం ప్రక్రియలో ఎమ్మెల్యే మైనారిటీల ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక చొరవ చూపారని కాంగ్రెస్ మైనారిటీ నాయకులు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ మైనారిటీ నాయకులు చేస్తున్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని, వాస్తవానికి ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీసుకుంటున్న చర్యలను ప్రజలు గమనిస్తున్నారని నాయకులు తెలిపారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ నసీం జ,డివిజన్ అధ్యక్షులు జాఫర్, నాయకులు గౌస్ పాషా,జుబేదా బేగం,ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

# 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం




న్యూఢిల్లీ, జూలై 29: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక 'జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ప్రదానం చేసింది .న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ భవన్లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించిన 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.ప్రజా జీవితం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, తెలుగు భాషాసాహిత్యాభివృద్ధి, సామాజిక రంగాల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామప్రసాద్, పరిషత్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ రమణ, కాంతేటి వెంకటరాజు, ఆదిలీలా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్. ఆదినారాయణతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు, సామాజికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా అత్యంత వైభవంగా ఈ వేడుకలు నిర్వహించారు.

# సీనియర్ నాయకుడికి ఎమ్మెల్యే KR నాగరాజు గారు ఘననివాళి...

## అడప మహేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటది...



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ వర్ధన్నపేట నియోజకవరం 14 డివిజన్ సీనియర్ నాయకులు,సోషల్ మీడియా ఇంచార్జ్ అడప మహేష్ ఇటీవల దుర్మరణం చెందిన విషయం విధితమే.బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు 14వ డివిజన్లోని పుష్పరాజ్ ఫంక్షన్ లో ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమానికి తెలంగాణ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ గారు,వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ గార్లతో హాజరై మహేష్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.తన విజయానికి తమ వంతు కృషి చేస్తూ, పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందించి, నిబద్ధత కలిగిన నాయకుడు మహేష్ అని స్మరించుకున్నారు.ఆయన సేవలను పార్టీ ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని ఎమ్మెల్యే అన్నారు.మహేష్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు,డివిజన్ అధ్యక్షులు ఇంతియాజ్,వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ సారంగపాణి,మాజీ కార్పొరేటర్ సులోచన సారయ్య,3వ డివిజన్ అధ్యక్షులు జన్ను కరుణాకర్,డివిజన్,మండల,గ్రామ ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు స్వయం ఉపాధి దిశగా శిక్షణలు

## టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేత




హనుమకొండ, జూలై 29 హైదరాబాద్ ఎస్టేట్: మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో వనం మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం ముగిసింది. హనుమకొండ 2వ డివిజన్ గుండ్లసింగారంలో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. వనం మహిళా సంఘం సీఈవో నిర్మల, 2వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్ చేతుల మీదుగా మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. లావుడియా రవి నాయక్ మాట్లాడుతూ టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా కుట్టు మిషన్లు అందించే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సహకారం అందిస్తామని చెప్పారు. సంస్థ కోఆర్డినేటర్ కుమ్మరి రవికుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు 2 వేల మంది మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ అందించి, వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు పుట్ట తిరుపతి మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టైలరింగ్ శిక్షకురాలు భాగ్యలక్ష్మి, గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ద


# వరంగల్‌కు కమ్యూనిటీ రేడియో లేకపోవడంపై కేంద్రాన్ని ప్రశ్నించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



న్యూఢిల్లీ -పార్లమెంట్
హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ
తేది‘:29-07-2026

వరంగల్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రచార కార్యక్రమాల ద్వారా ఎంత మేర ప్రయోజనం చేకూరుతోంది? కమ్యూనిటీ రేడియో కేంద్రాలకు, ప్రజా అవగాహన కార్యక్రమాలకు ఎలాంటి సహాయం అందుతోంది? కేంద్ర సంక్షేమ పథకాల ప్రచారం కోసం వరంగల్‌లో చేపట్టిన చర్యలు ఏమిటి? అనే కీలక అంశాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో లేవనెత్తారు.గత మూడు సంవత్సరాల్లో వరంగల్ జిల్లాలో కమ్యూనిటీ రేడియో స్టేషన్లు, మీడియా అవుట్‌రీచ్ కార్యక్రమాలు, ప్రజా చైతన్య ప్రచారాలకు కేంద్రం అందించిన ఆర్థిక సహాయం, లబ్ధిదారుల వివరాలు, కేంద్ర పథకాల ప్రచారం కోసం చేపట్టిన కార్యక్రమాలపై కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖను ఎంపీ డా.కడియం కావ్య ప్రశ్నించారు.ఈ మేరకు వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ లిఖితపూర్వక సమాధానమిస్తూ ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఒక్క కమ్యూనిటీ రేడియో స్టేషన్ కూడా లేదని వెల్లడించారు. అయితే దేశవ్యాప్తంగా కమ్యూనిటీ రేడియో ఉద్యమాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ, వరంగల్‌లో మాత్రం ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.అలాగే గత మూడు సంవత్సరాల్లో వరంగల్, పరిసర ప్రాంతాల్లో 17 ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌లు నిర్వహించినట్లు కేంద్రం తెలిపింది. యోగా దినోత్సవం, స్వచ్ఛ భారత్ అభియాన్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, ఓటరు అవగాహన కార్యక్రమాలు, నషా ముక్త్ భారత్, పోషణ్ మాహ్ తదితర అంశాలపై ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించింది.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ,“వరంగల్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల సమాచారం మరింత విస్తృతంగా చేరాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో కమ్యూనిటీ రేడియో వంటి ప్రజా సమాచార వేదికలు లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని తెలిపారు. వరంగల్‌కు రావాల్సిన అవకాశాలు, కేంద్ర మద్దతు, సంస్థలను సాధించేందుకు పార్లమెంట్‌లో నిరంతరం ప్రశ్నిస్తాన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. జిల్లాకు సంబంధించిన ప్రతి అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం, వరంగల్‌కు తగిన ప్రాధాన్యం కల్పించడమే తన లక్ష్యమని ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నాయి.

# 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం




న్యూఢిల్లీ, జూలై 29: తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక 'జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ప్రదానం చేసింది .న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ భవన్లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించిన 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.ప్రజా జీవితం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, తెలుగు భాషాసాహిత్యాభివృద్ధి, సామాజిక రంగాల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామప్రసాద్, పరిషత్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ రమణ, కాంతేటి వెంకటరాజు, ఆదిలీలా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్. ఆదినారాయణతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహితీవేత్తలు, కళాకారులు, సామాజికవేత్తలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పేలా అత్యంత వైభవంగా ఈ వేడుకలు నిర్వహించారు.

# డీఎస్సీ నియామకాలపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయవద్దు: డా. పిట్టా వరప్రసాద్



ప్రెస్ నోట్
కాకినాడ, జూలై 29, 2026:

ఆంధ్రప్రదేశ్‌లో మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక ఉత్తర్వులు అందజేసిన అనంతరం, మొత్తం నియామక ప్రక్రియపై ఆధారాలు లేకుండా అవకతవకల ఆరోపణలు చేస్తూ రాజకీయ ఆందోళనలు నిర్వహించడం సమంజసం కాదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి డా. పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు.డీఎస్సీ నియామక ప్రక్రియకు సంబంధించిన మెరిట్ జాబితాలు, మార్కులు, ఎంపిక వివరాలు మరియు ఇతర సమాచారాన్ని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచి, అభ్యర్థులకు పరిశీలించే అవకాశం కల్పించడం పారదర్శకతకు నిదర్శనమని ఆయన అన్నారు. ఎవరికైనా అభ్యంతరాలు లేదా నిర్దిష్టమైన ఆధారాలు ఉంటే సంబంధిత అధికారులకు సమర్పించడం లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ప్రజాస్వామ్యబద్ధమైన మార్గమని సూచించారు.ఇప్పటికే వేలాది మంది యువతకు ఉద్యోగాలు లభించిన తర్వాత మొత్తం నియామక ప్రక్రియనే అనుమానాస్పదంగా చిత్రీకరించడం వల్ల కొత్తగా నియమితులైన ఉపాధ్యాయుల్లో అనవసర ఆందోళన, అభ్యర్థుల్లో అయోమయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు.

అలాగే, ఢిల్లీలో జరిగిన పరిణామాలను చూపిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం కూడా వాస్తవ పరిస్థితుల ఆధారంగానే ఉండాలని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు. ఒక సందర్భంలో జరిగిన రాజకీయ లేదా పరిపాలనా పరిణామాన్ని మరో సందర్భానికి యథాతథంగా వర్తింపజేయడం సరైన విధానం కాదన్నారు. ఏ మంత్రి రాజీనామా చేయాలన్నా దానికి సంబంధించి నిర్ధారిత వాస్తవాలు, చట్టబద్ధమైన విచారణలు లేదా బాధ్యతను నిరూపించే ఆధారాలు ఉండాలని పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు ఉన్నప్పటికీ, నిరాధార ఆరోపణలతో యువత భవిష్యత్తును రాజకీయాలకు బలిచేయడం తగదన్నారు. నిజంగా ఏవైనా అక్రమాలు జరిగి ఉంటే వాటిని ఆధారాలతో నిరూపించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేయాలని, లేకపోతే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాన్ని విరమించుకోవాలని ఆయన కోరారు.

డా. పిట్టా వరప్రసాద్ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు & జాతీయ కార్యదర్శి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్)

# 'ఇంటింటికి తెలుగుదేశం'.. మూడో రోజు జోరుగా కొనసాగిన కార్యక్రమం




మూడో రోజూ విజయవంతంగా “ఇంటింటికి తెలుగుదేశం“ కార్యక్రమం

మూడు రోజుల్లో 6.20 లక్షల ఇళ్లను సందర్శించిన టీడీపీ నేతలు

సాంకేతిక పరిజ్ఞానంతో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న నారా లోకేశ్

కుప్పంలో పర్యటించి మహిళల సమస్యలు తెలుసుకున్న భువనేశ్వరి

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



## పంచర్ షాప్ కార్మికుల హక్కుల కోసం పోరాటం

### జీవనోపాధికి భంగం కలిగించే ఉచిత సేవలను నిలిపివేయాలి

### రాష్ట్ర యూనియన్ డిమాండ్



హనుమకొండ, జూలై 26 హైదరాబాద్ ఎస్టేట్:
పంచర్ షాప్ కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర పంచర్ షాప్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర మహాసభను ఆదివారం బాలసముద్రంలోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పంచర్ షాప్ యూనియన్ అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ పంచర్ షాప్‌లపై ఆధారపడి జీవిస్తున్న కార్మికుల ఉపాధిని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వ్యాపారుల జీవనోపాధికి ఇబ్బందులు కలిగించే విధానాలను నియంత్రించాలని కోరారు. కొన్ని పెట్రోల్ బంకుల్లో ఉచితంగా వాహనాలకు గాలి నింపే సేవల వల్ల పంచర్ షాప్ కార్మికుల ఆదాయంపై ప్రభావం పడుతోందని పేర్కొంటూ, ఈ విధానాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు చెందిన అనేక మంది ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల హక్కుల సాధనకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు, హక్కుల సాధన కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈ మహాసభ నిర్వహించినట్లు తెలిపారు. మహాసభలో యూనియన్ ప్రతినిధులు, పంచర్ షాప్ కార్మికులు పాల్గొన్నారు.

## భూ హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం

### తెలంగాణ భూ రక్షణ సమితి జిల్లా సమావేశంలో నాయకుల వెల్లడి



వరంగల్, జూలై 29 హైదరాబాద్ ఎస్టేట్:
భూములపై హక్కులు, పట్టాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలంగాణ భూ రక్షణ సమితి నాయకులు తెలిపారు. వరంగల్ జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు కందికట్ల రాజయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమావేశంలో భూ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు దళిత రత్న నత్తి కొర్నేల్, రాష్ట్ర నాయకుడు ఇల్లందుల రాజేష్ ఖన్నా, ఉమ్మడి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఇమ్మడి రాము తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నత్తి కొర్నేల్ మాట్లాడుతూ భూమిపై ఆధారపడి జీవిస్తున్న దళితులు, గిరిజనులు, బీసీలు, పేద వర్గాలకు భూ హక్కుల విషయంలో న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న వారికి హక్కుల భద్రత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. భూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు బాధిత వర్గాల తరఫున తెలంగాణ భూ రక్షణ సమితి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. భూమి అనేది పేద కుటుంబాలకు జీవనాధారమని, వారి హక్కుల పరిరక్షణకు సంఘటిత కృషి అవసరమని అన్నారు. అనంతరం తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర కమిటీ సామాజిక సేవలను గుర్తిస్తూ పసునూరి స్వామిని ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య సలహాదారుగా నియమించింది. ఈ సందర్భంగా బాధ్యత అప్పగించిన నాయకులకు పసునూరి స్వామి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గీసుగొండలో ఘనంగా గురుపౌర్ణమి

### వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..

### భక్తులతో కిటకిటలాడిన ఆలయం



గీసుగొండ, జూలై 29 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుగొండ మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 6.30 గంటలకు స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, నూతన వస్త్రాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో గురుపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ప్రత్యేక పూజల్లో గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా పూజా కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన భక్తులకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలను దైవజ్ఞ ఆచార్య బెజ్జంకి బిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## అమ్మవారి సేవలో దాస్యం

### భద్రకాళీ ఆలయంలో శాకంభరీ ఉత్సవాల పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



వరంగల్, జులై 29 హైదరాబాద్ ఎస్టేట్:
ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శాకంభరీ ఉత్సవాల్లో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ సకుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. శాకంభరీ ఉత్సవాల సందర్భంగా భద్రకాళీ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# వరుణయాగంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

### సకాలంలో వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు





పరకాల, జూలై 29 హైదరాబాద్ ఎస్టేట్:
పరకాల పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన హిరణ్య ఋష్యశృంగావాహన వరుణయాగ మహోత్సవంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తన సతీమణితో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు పుష్కల దిగుబడులతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో జీవించాలని శ్రీ కుంకుమేశ్వరస్వామిని ప్రార్థించారు. వరుణయాగ మహోత్సవంలో ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ చిహ్నాల రక్షణకు చట్టాలు బలోపేతం చేయాలి

### సవరణ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు..

### రాజ్యసభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



న్యూఢిల్లీ, జూలై 29 హైదరాబాద్ ఎస్టేట్:
జాతీయ జెండా, జాతీయ గీతం, రాజ్యాంగం వంటి జాతీయ చిహ్నాలు దేశ గౌరవానికి ప్రతీకలని, వాటి పరిరక్షణకు చట్టాలు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. 'జాతీయ గౌరవానికి అవమానం నిరోధక (సవరణ) బిల్లు2026' పై రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, త్రివర్ణ పతాకం సాధారణ వస్త్రం కాదని, అది దేశ స్వాతంత్ర్య పోరాటం, అమరవీరుల త్యాగాలు, ప్రజాస్వామ్య విలువలకు ప్రతీక అని పేర్కొన్నారు. 1971లో రూపొందించిన చట్టం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఉందని, ప్రస్తుతం సోషల్ మీడియా, కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ వేదికల విస్తరణతో జాతీయ చిహ్నాల అవమానకర ఘటనలు క్షణాల్లో వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చట్టాల్లో మార్పులు అవసరమని పేర్కొన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు రాజ్యాంగం రక్షణ కల్పించినప్పటికీ, దేశ సమగ్రత, సార్వభౌమత్వం, ప్రజా శాంతి పరిరక్షణకు అవసరమైన పరిమితులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వాలను విమర్శించడం ప్రజాస్వామ్య హక్కు అయినప్పటికీ, జాతీయ చిహ్నాలను అవమానించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. జాతీయ చిహ్నాల పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా జాతీయ గౌరవాన్ని అవమానించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భారత జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య సేవలను స్మరించిన ఎంపీ రవిచంద్ర, దేశ నిర్మాణంలో బీసీల పాత్ర కీలకమని అన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీల కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని 'జాతీయ గౌరవానికి అవమానం నిరోధక (సవరణ) బిల్లు2026'కు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు.

## బర్కత్‌పుర శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా విద్యార్థుల అధికార స్వీకార వేడుకలు







బర్కత్‌పుర, జూలై 29:
హైదరాబాద్ లోని బర్కత్‌పుర శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల అధికార స్వీకార వేడుకలు (ఇన్వెస్టిచర్ సెర్మనీ) అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వివిధ నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. తద్వారా వారిలో బాధ్యతా భావం, నైతిక విలువలు మరియు సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు చక్కటి వేదిక కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాచిగూడ ఎస్.ఐ. రాజేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులంతా భవిష్యత్తులో ఉత్తమ నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. నాయకత్వం అనేది కేవలం ఒక పదవి కాదని, అది ఒక గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ నైతికతతో, నిజాయితీతో నడుచుకుంటే సమాజంలో గొప్ప నాయకులుగా రాణించగలరని ఉద్బోధించారు. ఈ వేడుకల్లో భాగంగా నూతన నాయకత్వ బాధ్యతలు చేపట్టిన విద్యార్థులకు ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణగూడ ఏజీఎం నూర్ మొహమ్మద్ అలీ, ఆర్ఐ బండి వెంకటేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ డి. రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ఆకుల మాధవి దేవి, డీన్ గాయత్రి , సిఇన్‌చార్జ్ వెంకటేష్, ప్రైమరీ ఇన్‌చార్జ్ ఎస్. సవిత, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ మాలతి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వీరితో పాటు పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువులకు ఘనంగా సన్మానం

### ముఖ్య అతిథిగా కందుల సమత




హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 29
గురు పౌర్ణిమ సందర్భంగా గురువులకు ఘన సన్మానం జడ్.పి.హెచ్.ఎస్ తుక్కుగూడలో
గురు పౌర్ణిమ సందర్భంగా జడ్.పి.హెచ్.ఎస్ తుక్కుగూడ పాఠశాలలో ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. భాస్కర్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ వనిత పాఠశాల అభివృద్ధి కోసం సుమారు ₹1,00,000 విలువైన 100 కుర్చీలను అందజేశారు. ఈ సహాయానికి పాఠశాల కుటుంబం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షురాలు శ్రీమతి సమత ముఖ్య అతిథిగా హాజరై గురువుల సేవలను కొనియాడారు. విద్యార్థులు గురువుల ఆశీస్సులతో విద్యతో పాటు క్రీడల్లోనూ ఉన్నత శిఖరాలను చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకులు ముత్యాల మహేందర్, సీనియర్ క్రీడాకారుడు సతీష్, గ్రామ యువకులు మధు, సుధాకర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించి, వారి సేవలను స్మరించుకున్నారు. విద్యా, క్రీడా రంగాల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కార్యక్రమంలో పాల్గొన్నవారు పిలుపునిచ్చారు.

# మహిళలకు స్వయం ఉపాధి దిశగా శిక్షణలు

## టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేత

హనుమకొండ, జూలై 29 హైదరాబాద్ ఎస్టేట్: మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో వనం మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం ముగిసింది. హనుమకొండ 2వ డివిజన్ గుండ్లసింగారంలో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. వనం మహిళా సంఘం సీఈవో నిర్మల, 2వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ లావుడియా రవి నాయక్ చేతుల మీదుగా మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా నిర్మల మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలనే ఉద్దేశంతో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. లావుడియా రవి నాయక్ మాట్లాడుతూ టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా కుట్టు మిషన్లు అందించే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సహకారం అందిస్తామని చెప్పారు. సంస్థ కోఆర్డినేటర్ కుమ్మరి రవికుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు 2 వేల మంది మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ అందించి, వారి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. డివిజన్




అధ్యక్షుడు పుట్ట తిరుపతి మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో టైలరింగ్ శిక్షకురాలు భాగ్యలక్ష్మి, గ్రామ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# ఉత్తరాంధ్రలో ఏనుగుల దాడులకు చెక్..

## కుంకీ శిబిరాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్

ఉత్తరాంధ్రలో ఏళ్ల తరబడి రైతులను, ప్రజలను భయపెడుతున్న ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటు చేసిన కుంకీ ఏనుగుల శిబిరాన్ని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ–అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ బుధవారం ప్రారంభించారు. వన్యప్రాణుల సంరక్షణతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ శిబిరం ఏర్పాటు ఉత్తరాంధ్రలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన అభివర్ణించారు.సీతానగరం మండలం గుచ్చిమి గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పవన్ కల్యాణ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, “ప్రకృతి మనది కాదు, మనమే ప్రకృతిలో భాగం. కాబట్టి దానితో సామరస్యంగా జీవించాలి. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత ఉన్నప్పుడే సుస్థిర ప్రగతి సాధ్యమవుతుంది“ అని అన్నారు.పార్వతీపురం మన్యం జిల్లాలో అడవుల నుంచి ఏనుగులు గ్రామాల్లోకి రావడం, రైతుల పంటలను నాశనం చేయడం, రాత్రిపూట ప్రజలు భయంతో జీవించడం వంటి సమస్యలు చాలాకాలంగా ఉన్నాయని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించాలనే లక్ష్యంతోనే ‘గుచ్చిమి ఎలిఫెంట్ హోల్డింగ్ ఏరియా‘ను ఏర్పాటు చేశామని వివరించారు.గతంలో చిత్తూరు జిల్లా పలమనేరు ప్రాంతంలో ‘జయంత్‘, ‘అభిమన్యు‘ అనే కుంకీ ఏనుగులు అటవీ శాఖ అధికారులతో కలిసి అద్భుతంగా పనిచేశాయని తెలిపారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో అక్కడ ఏనుగుల దాడుల్లో మరణాలను 70 శాతానికి పైగా తగ్గించామని, పంట నష్టాన్ని కూడా గణనీయంగా నివారించామని పేర్కొన్నారు. మన్యం జిల్లాలోనూ అలాంటి విజయాన్నే సాధించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ శిబిరం



కోసం నాలుగు కుంకీ ఏనుగులను పంపిన కర్ణాటక ప్రభుత్వానికి, ప్రజలకు పవన్ కల్యాణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. “ఏనుగులను బహుమతిగా ఇవ్వడాన్ని అక్కడి ప్రజలు తమ సంపదను పంచుకోవడంతో సమానంగా భావిస్తారు. ఇది వారి ఉదారతకు, స్నేహానికి నిదర్శనం. తెలుగు ప్రజల భద్రతపై ప్రేమతో ఏనుగులను పంపినందుకు వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు“ అని ఆయన అన్నారు. మానవులు, ఏనుగులు సామరస్యంగా సహజీవనం చేసేందుకు ఈ శిబిరం వేదికగా నిలుస్తుందని ఆశిస్తూ, దీనిని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు.




# అఖిలప్రియకు అధిష్ఠానం సీరియస్ వార్నింగ్..

## భర్త జోక్యంపై చంద్రబాబు ఆగ్రహం!

ఆళ్లగడ్డ నియోజకవర్గ రాజకీయాలు, అహోబిలం దేవాలయ టెండర్ల వివాదంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం తీవ్రంగా స్పందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి పిలిపించి, ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నియోజకవర్గ వ్యవహారాల్లో ఆమె భర్త భార్గవ్ రామ్ జోక్యం చేసుకోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పల్లా స్పష్టం చేసినట్లు తెలిసింది.అహోబిలం ఆలయంలో తలనీలాల కాంట్రాక్ట్ వ్యవహారంలో అఖిలప్రియ జోక్యం చేసుకోవడం, ఆమె భర్త కారణంగా స్థానికంగా మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులతో విభేదాలు తలెత్తడం వంటి అంశాలపై అధిష్టానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈటీవీ భారత్ కథనం ప్రకారం, ఎమ్మెల్యేగా కేవలం అఖిలప్రియ మాత్రమే బాధ్యతలు చూడాలని, ఆమె భర్త జోక్యం ఎంతమాత్రం ఉండటానికి వీల్లేదని పల్లా కరాఖండిగా చెప్పారు. పార్టీ క్రమశిక్షణను దాటితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.ఈ సందర్భంగా, దివంగత నేతలైన భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల రాజకీయ స్థాయికి తగినట్లుగా పనిచేయాలని, వారి పేరు నిలబెట్టాలని అఖిలప్రియకు పల్లా సూచించారు. పార్టీ సూచనలు తప్పక పాటిస్తానని అఖిలప్రియ హామీ ఇచ్చారు. అధిష్టానం ఆదేశాల మేరకు నడుచుకుంటే పార్టీ పూర్తి అండగా ఉంటుందని పల్లా భరోసా ఇచ్చారు.భేటీ అనంతరం అఖిలప్రియ మాట్లాడుతూ.. ఆళ్లగడ్డలో ఏ చిన్న సంఘటన జరిగినా దానిని పెద్ద సెన్సేషన్‌గా మారుస్తున్నారని అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో అనవసరంగా హైప్ క్రియేట్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని వివాదాలు, సమస్యలపై పార్టీ



అధ్యక్షుడికి పూర్తి స్పష్టత ఇచ్చానని, పార్టీ శ్రేణుల్లో ఎలాంటి అయోమయం ఉండకూడదనే ఉద్దేశంతోనే ఆయన్ను కలిశానని వివరించారు. మొత్తం మీద, ఆళ్లగడ్డలో పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించే ఏ చర్యనూ సహించేది లేదని టీడీపీ అధిష్ఠానం అఖిలప్రియకు స్పష్టమైన సంకేతాలు పంపినట్లయింది.

# మరోసారి మంచి మనసును చాటుకున్న మెగాప్రిన్స్ వరుణ్ తేజ్



ప్రముఖ సినీ నటుడు వరుణ్ తేజ్ తన ఉదారతను మరోసారి చాటుకున్నారు. ట్యూమర్‌తో బాధపడుతున్న అనంతపురం జిల్లాకు చెందిన ఓ అభిమానికి అండగా నిలిచి, తన మానవత్వాన్ని ప్రదర్శించారు. బాధితుడిని హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించడమే కాకుండా, చికిత్సకు అయ్యే పూర్తి వ్యయాన్ని తానే స్వయంగా భరించి భరోసానిచ్చారు.అనంతపురం జిల్లా చిరంజీవి యువత అధ్యక్షుడు, గుత్తి పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు సురేష్ పాటిల్ కొంతకాలంగా ట్యూమర్ సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వరుణ్ తేజ్ తక్షణమే స్పందించారు. తన తల్లి పద్మజ సహకారంతో సురేష్‌ను హైదరాబాద్‌లోని సిటీ న్యూరో సెంటర్‌కు తరలించి, మెరుగైన వైద్యం అందేలా అక్కడి వైద్యులతో మాట్లాడి అన్ని ఏర్పాట్లు చేశారు.వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో సురేష్ పాటిల్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. చికిత్స సమయంలో బాధితుడి కుటుంబానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆసుపత్రిలో అవసరమైన అన్ని సౌకర్యాలను వరుణ్ తేజ్ కల్పించారు. సురేష్ పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యే వరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అండగా నిలిచారు.వరుణ్ తేజ్ అభిమానుల పట్ల తన సేవా గుణాన్ని చాటుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో అనంతపురం జిల్లాకే చెందిన మరో అభిమాని మరణించినప్పుడు కూడా వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్నారు. తన పెదనాన్న, మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తితో వరుణ్ తేజ్ ఇటువంటి కార్యక్రమాలు చేపడుతూ, కష్టకాలంలో అభిమానులను ఆదుకోవడం పట్ల పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ పకడ్బందీగా ఉండాలి: మంత్రి నారా లోకేశ్

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎలాంటి న్యాయపరమైన, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నోటిఫికేషన్లు విడుదల చేయాలని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను స్పష్టంగా ఆదేశించారు. జాబ్ కేలండర్–2026 అమలుపై ఆయన అధ్యక్షతన ఏర్పాటైన మంత్రుల బృందం బుధవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించింది. ఈ సమావేశానికి పలువురు మంత్రులు ఆన్‌లైన్ ద్వారా హాజరు కాగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సహా కీలక అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు, వాటి భర్తీకి అనుసరించాల్సిన విధివిధానాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రుల బృందానికి వివరించారు.జాబ్ కేలండర్–2026లో భాగంగా ప్రకటించిన 10,060 ఉద్యోగాలను మొత్తం నాలుగు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా తొలి దశలో వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ ఏడాది మే 15నే నోటిఫికేషన్ జారీ చేసిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు. రెండో దశ కింద 3,168 పోస్టులకు వాస్తవానికి ఆగష్టు 15న నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. అయితే, రాష్ట్రపతి ఉత్తర్వుల అమలులో ఎదురైన కొన్ని సాంకేతిక ఇబ్బందులు, ఉద్యోగ సంఘాల నుంచి వచ్చిన వినతుల నేపథ్యంలో ఈ ప్రక్రియలో స్వల్ప జాప్యం జరిగింది. ఈ కారణాలను పరిగణనలోకి తీసుకున్న మంత్రుల బృందం, రెండో దశ నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 15న విడుదల చేయాలని నిర్ణయించింది.

3, 4 దశల నోటిఫికేషన్లు అక్టోబర్‌లో

జాబ్ కేలండర్‌ను వేగంగా పూర్తి చేసేందుకు వీలుగా మూడు, నాలుగు దశల ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఒకేసారి అక్టోబర్ 15న విడుదల చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. మూడో దశలో 2,388 పోస్టులు, నాలుగో దశలో 2,981 పోస్టులు భర్తీ చేయనున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆయా శాఖల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఖాళీలను భర్తీ చేయాలని, ఆ దిశగా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. రెండో దశలో భర్తీ చేయనున్న 3,168 పోస్టుల్లో అత్యధికంగా 2,225 పోస్టులు హోంశాఖ పరిధిలోనే ఉన్నాయని అధికారులు తెలిపారు. గ్రూప్–1లో ప్రస్తుతం గుర్తించిన పోస్టుల సంఖ్యను మరింత పెంచాల్సిన



అవసరం ఉందని మంత్రుల బృందం ఈ సందర్భంగా అభిప్రాయపడింది.మొత్తం 10,060 పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, సకాలంలో పూర్తి చేసి, ప్రతి ఏటా జాబ్ కేలండర్ విడుదల చేసే సంప్రదాయాన్ని కొనసాగించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. జాబ్ కేలండర్–2026కు సంబంధించిన పూర్తిస్థాయి ఖాళీల వివరాలను ఈ నెల 6న జరగనున్న కేబినెట్ సమావేశం ముందు ఉంచనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో మంత్రులు వంగలపూడి అనిత, పి. నారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కందుల దుర్గేష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ రాజీవ్ కుమార్ మీనా, ఆర్థికశాఖ కార్యదర్శి వినయ్ చంద్, ఏపీపీఎస్సీ కార్యదర్శి రవి సుభాష్ పాల్గొన్నారు.

# ‘వందేమాతరం’ను అవమానిస్తే ఇకపై శిక్ష..

## రాజ్యసభలో బిల్లుకు ఆమోదం



జాతీయ గేయం ‘వందేమాతరం’ను ఉద్దేశపూర్వకంగా అవమానించడాన్ని శిక్షార్హ నేరంగా ప్రకటించే ‘జాతీయ గౌరవానికి అవమాన నిరోధక (సవరణ) బిల్లు–2026’కు రాజ్యసభ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం జాతీయ జెండా, జాతీయ గీతానికి ఉన్న చట్టపరమైన రక్షణను ఇకపై వందేమాతరానికీ వర్తింపజేయనున్నారు. బిల్లుపై సుదీర్ఘ చర్చ అనంతరం ఎగువ సభ దీన్ని ఆమోదించింది.బిల్లుపై చర్చ సందర్భంగా సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు రావాలని ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆప్, కాంగ్రెస్, సీపీఎం సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, అనంతరం ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ఇరు పక్షాల సభ్యులు తమ అభిప్రాయాలు వెల్లడించిన తర్వాత కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానం ఇచ్చారు.ఈ సందర్భంగా నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ, 1971లో జాతీయ చిహ్నాల పరిరక్షణ కోసం ఈ చట్టాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే రక్షణను వందేమాతరానికీ విస్తరిస్తున్నామని చెప్పారు. బంకించంద్ర చటర్జీ 1875లో ఈ గీతాన్ని రచించారని, 1896 కాంగ్రెస్ సమావేశంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఆలపించారని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులు చివరి క్షణాల్లో కూడా ‘వందేమాతరం’ నినాదం చేశారని గుర్తుచేశారు.ఈ బిల్లును వ్యతిరేకించడం జాతీయ నాయకుల భావాలకు విరుద్ధమని మంత్రి వ్యాఖ్యానించారు. దేశ ఐక్యత, జాతీయ భావనను బలోపేతం చేయడమే ఈ చట్టం ఉద్దేశమని చెప్పారు. దర్యాప్తు, చర్చల అనంతరం ప్రతిపక్షం వాకౌట్ చేసిన నేపథ్యంలో రాజ్యసభ బిల్లును ఆమోదించింది. ఇక ఈ బిల్లు చట్టంగా మారాలంటే రాష్ట్రపతి ఆమోదం పొందాల్సి ఉంది.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# రీఎంట్రీకి ఇది సరైన సినిమా అనిపించింది: వరుణ్ తేజ్

గత రెండేళ్లుగా వెండితెరకు దూరంగా ఉండటంపై కథానాయకుడు వరుణ్ తేజ్ స్పష్టతనిచ్చారు. ఇది బలవంతంగా తీసుకున్న విరామం కాదని, భవిష్యత్తులో ఎటువంటి పాత్రలు పోషించాలనే అంశంపై స్పష్టత తెచ్చుకోవడం కోసమే ఈ విరామం తీసుకున్నానని ఆయన తెలిపారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తాను నటిస్తున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ చిత్రం 'కొరియన్ కనకరాజు'తో ఆయన త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో వరుణ్ తేజ్ మాట్లాడుతూ, "కేవలం విరామం తీసుకోవాలనే ఉద్దేశంతో నేను సినిమాలకు దూరం కాలేదు. ఎటువంటి పాత్రలు చేయాలనే విషయంపై నాకు పూర్తి స్పష్టత కావాలి. మొక్కుబడిగా సినిమాలు చేయడం నాకు ఇష్టం ఉండదు. కథను పూర్తిగా నమ్మినప్పుడే ప్రాజెక్టుకు అంగీకరిస్తాను" అని వివరించారు. ఈ క్రమంలోనే దర్శకుడు గాంధీ వినిపించిన 'కొరియన్ కనకరాజు' కథ ఎంతో వైవిధ్యంగా అనిపించిందని, సుదీర్ఘ విరామం తర్వాత పునరాగమనానికి ఇది సరైన చిత్రమని భావించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చిత్ర విశేషాలను పంచుకుంటూ, "ఇది ఇండో-కొరియన్ నేపథ్యంలో సాగే హారర్ కామెడీ చిత్రం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఇప్పటివరకు ఎవరూ ఇటువంటి జోనర్‌ను ప్రయత్నించలేదు. అందుకే ఈ కథ వినగానే వెంటనే అంగీకరించాను" అని తెలిపారు. ఇందులో తన పాత్ర పేరు కనకరాజు అని, తన నిజ జీవిత వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా సాగే ఈ పాత్ర ప్రేక్షకులను విశేషంగా అలరిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ పాత్ర కోసం తాను చేసిన కసరత్తులను వరుణ్ వెల్లడించారు. రాయలసీమ యాస నేర్చుకోవడంతో పాటు, కొరియన్ భాషలో సుదీర్ఘ సంభాషణలు పలకడం, విభిన్నమైన లుక్ కోసం జుట్టు పెంచడం మరియు నృత్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటివి చేశానని పేర్కొన్నారు. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్న 'కొరియన్ కనకరాజు' చిత్రం ఆగస్టు 7న థియేటర్లలో విడుదల కానుంది.




## 'మీ నమ్మకాన్ని ఎప్పటికీ మర్చిపోలేను'.. విజయ్‌కు అనిరుధ్ భావోద్వేగ సందేశం

తమిళనాడు ముఖ్యమంత్రి, నటుడు విజయ్‌కు సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ కృతజ్ఞతలు తెలిపాడు. 'జన నాయగన్'తో పాటు 'లియో', 'బీస్ట్', 'మాస్టర్', 'కత్తి' చిత్రాల్లో కలిసి పనిచేసిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్టు చేశాడు. ఈ ప్రయాణం తనకు ఎంతో మధురమైనదని, భావోద్వేగాలతో నిండినదని పేర్కొన్నాడు. "మీతో కలిసి పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నాపై మీరు ఉంచిన అపారమైన నమ్మకానికి ధన్యవాదాలు. ఈ జ్ఞాపకాలను జీవితాంతం మర్చిపోలేను. మన సంగీతం ఎప్పటికీ జీవిస్తుంది" అని అనిరుధ్ తన పోస్టులో రాసుకొచ్చాడు. ఈ సందర్భంగా విజయ్‌తో కలిసి ఉన్న ఫొటోను కూడా పంచుకున్నాడు. విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత విడుదలైన తొలి చిత్రం 'జన నాయగన్'. ఇది విజయ్ నటించిన చివరి సినిమా కూడా. ఇందులో బాబీ డియోల్, పూజా హెగ్డే, మమితా బైజూ కీలక పాత్రలు పోషించారు. తెలుగు చిత్రం 'భగవంత్ కేసరి'కి ఇది రీమేక్‌గా తెరకెక్కింది.



## రాయల్ లుక్ లో అందర్నీ తమ వైపు తిప్పుకున్న క్యూట్ జోడీ!

టాలీవుడ్ లో 'మహా సముద్రం' సినిమా ద్వారా పరిచయమై, ఆ తర్వాత ప్రేమలో పడి వివాహ బంధంతో ఒకటైన సిద్ధార్థ్, అదితి రావు హైదరి క్యూట్ కపుల్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ లవ్లీ పెయిర్ తాజాగా ప్రముఖ డిజైనర్ జయంతి రెడ్డి నిర్వహించిన ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్ చేసి అందరి దృష్టినీ ఆకర్షించారు. తమ రాయల్ అవుట్‌ఫిట్స్, అదిరిపోయే కెమిస్ట్రీతో ఈ షోకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచి సరికొత్త 'కపుల్ గోల్స్' సెట్ చేశారు.


రాయల్ లుక్‌తో అదితి మెరుపులు:
ఈ ఫ్యాషన్ షోలో అదితి రావు హైదరి రాయల్ ప్రిన్సెస్‌లా మెరిసిపోయారు. ఆమె గోల్డ్ అండ్ బేజ్ కలర్ కాంబినేషన్‌లో ఉన్న హెవీలీ ఎంబ్రాయిడరీ పెప్లమ్ బాడీస్, దానికి మ్యాచింగ్‌గా గ్రాండ్ జర్దోజీ వర్క్, పూసల అలంకరణ ఉన్న షరారా స్కర్ట్ ధరించి ర్యాంప్‌పై కనువిందు చేశారు. ఇక ఆమె ఎలిగెంట్ లుక్ ఫ్యాషన్ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది.

సిద్ధార్థ్ హెరిటేజ్ షేర్వానీ స్టైల్:
ఇక సిద్ధార్థ్ కూడా అదితి డ్రెస్‌కు పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అయ్యేలా బేజ్ కలర్ హెరిటేజ్ షేర్వానీ జాకెట్, ధోతీ స్టైల్ ట్రౌజర్స్ ధరించి చాలా క్లాసీగా కనిపించారు. ఆయన మెడలో వేసుకున్న మల్టీ-లేయర్డ్ పెర్ల్ అండ్ ఎమరాల్డ్ హారం ఆయన రాయల్ లుక్‌ను మరింత హైలైట్ చేసింది.

మ్యాజికల్ కెమిస్ట్రీతో అలరించిన జోడీ:
డిజైనర్ జయంతి రెడ్డి రూపొందించిన 'ది గిల్డెడ్ ఎరా' కలెక్షన్‌కు షోస్టాపర్లుగా విచ్చేసిన ఈ జంట, స్టేజీపై కలసి నడుస్తుంటే నిజమైన రాజకుమారుడు, రాజకుమారి నడుస్తున్నట్లే ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక వీరిద్దరి మధ్య ఉన్న బాండింగ్, ఈజీ కెమిస్ట్రీ ర్యాంప్ వాక్‌ను మరింత స్పెషల్‌గా మార్చేశాయి.

సోషల్ మీడియాలో పోస్టర్లు ట్రెండింగ్:
ఈ ఫ్యాషన్ ఈవెంట్‌కు సంబంధించిన పిక్స్, వీడియోలు సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్‌గా మారాయి. "ప్యూర్ రాయల్ ఎలిగెన్స్" అని కామెంట్లు చేస్తూ ఫ్యాన్స్ ఈ పిక్స్‌ను విపరీతంగా షేర్ చేస్తున్నారు. ఇక నిజ జీవితంలోనే కాకుండా ఇలాంటి ఈవెంట్లలోనూ తమ కెమిస్ట్రీతో ప్రతీ ఒక్కరినీ మైమరపిస్తున్నారు ఈ క్యూట్ జోడీ.

పెళ్లి తర్వాత కూడా అదే మ్యాజిక్:
సినిమా పరిచయం నుంచి రీల్ అండ్ రియల్ లైఫ్ పార్ట్‌నర్స్‌గా మారిన సిద్ధార్థ్-అదితి, తమ అప్యాయతతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తుంటారు. ఇక ఈ ర్యాంప్ వాక్‌లో చూపించిన రాయల్ అండ్ క్యూట్ లుక్స్ వారి బంధం ఎంత ముచ్చటగా ఉందో మరోసారి చాటిచెప్పాయి.



## ప్రభుత్వాలను ఏఐ అంతం చేస్తుంది: రామ్ గోపాల్ వర్మ



ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియా వేదికగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), భవిష్యత్తు రాజకీయాలపై మరోసారి తనదైన శైలిలో సంచలన విశ్లేషణ చేశారు. రాబోయే రోజుల్లో ఏఐ దెబ్బకు రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల అవసరమే లేకుండా పోతుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రభుత్వాలను ఏఐ అంతం చేస్తుందని అన్నారు. ప్రస్తుత పాలనా వ్యవస్థ అంతా నిజాయతీ, నిర్భయం అనే మానవ బలహీనతలపైనే ఆధారపడి నడుస్తోందని ఆర్జీవీ పేర్కొన్నారు. బదిలీల భయం, పిల్లల చదువులు, లంచాలు, నేతల ఒత్తిళ్లతో అధికారులు లొంగిపోతుంటారని... అదే ఒక అధికారి స్థానంలో 'ఏఐ' ఉంటే పరిస్థితి పూర్తిగా మారిపోతుందని తెలిపారు. ఏఐకి బదిలీ భయం ఉండదు, దురాశ ఉండదు, అర్ధరాత్రి ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చే మంత్రుల బంధువులకు లొంగదని వర్మ స్పష్టం చేశారు. దుబాయ్‌లో ఇప్పటికే మనుషుల ప్రమేయం లేకుండా పనిచేస్తున్న 'స్మార్ట్ పోలీస్ స్టేషన్ల'ను ఇందుకు ఉదాహరణగా చూపారు. నాయకులు సెలెక్టివ్ డేటాతో డ్రామాలు ఆడుతుంటే.. ఏఐ మాత్రం శాటిలైట్ సమాచారం, వాతావరణం, మార్కెట్ ధరలను క్షణాల్లో విశ్లేషించి కచ్చితమైన పరిష్కారాన్ని కళ్లముందు ఉంచుతుందన్నారు. ప్రజాప్రతినిధులు మధ్యవర్తులుగా పనిచేసే వ్యవస్థను ఏఐ పారదర్శకంగా మార్చేస్తే, నాయకుల స్వార్థ రాజకీయాలు సాగవని వ్యాఖ్యానించారు. ఆర్థిక అభివృద్ధి, రక్షణ బడ్జెట్ వంటివి మానవ నైతిక నిర్ణయాలని కొందరు వాదించవచ్చు కానీ.. ఇప్పటివరకు నేతలు ఎంతవరకు మానవత్వంతో ఆలోచించారని వర్మ ప్రశ్నించారు. ఏఐ చూడటానికి మనిషి కాకపోయినా, స్వార్థపరులైన మనుషుల కంటే ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఆర్జీవీ తేల్చి చెప్పారు.

# రవితేజ 'ఇరుముడి'..

## ఆగస్టు 21న గ్రాండ్ రిలీజ్




మాస్ మహారాజా రవితేజ తన తదుపరి చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా, సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇరుముడి' సినిమా విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఓ కొత్త పోస్టర్‌తో వెల్లడించింది. ఇంకా 25 రోజుల్లో సినిమా రానుందంటూ చేసిన ఈ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. మాస్, యాక్షన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవితేజ, 'నిన్ను కోరి', 'మజిలీ', 'ఖుషి' వంటి ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలతో విజయం సాధించిన శివ నిర్వాణ కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో దీనిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. "అత్యంత హృద్యమైన తండ్రీకూతుళ్ల కథ" అంటూ మేకర్స్ ఈ సినిమా థీమ్‌ను పరిచయం చేశారు. రవితేజను ఇప్పటివరకు చూడని ఒక కొత్త ఎమోషనల్ పాత్రలో ఈ చిత్రం చూపించబోతోందని స్పష్టమవుతోంది. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ, బేబీ నక్షత్ర తండ్రీకూతుళ్లుగా కనిపించడం ఆకట్టుకుంటోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ నటుడు సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒక మాస్ హీరో, ఎమోషనల్ కథతో వస్తుండటంతో 'ఇరుముడి' చిత్రంపై సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపయింది.

# రెండు బ్లాక్‌బస్టర్లు మిస్

## కెరీర్‌పై సుమంత్ షాకింగ్ కామెంట్స్!



తెలుగు చిత్రసీమలో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ సొంతం చేసుకున్న వర్సటైల్ యాక్టర్ సుమంత్, తాజాగా తన కెరీర్‌లో మిస్ అయిన రెండు భారీ బ్లాక్‌బస్టర్ సినిమాల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఆయన నటించిన కొత్త చిత్రం 'న్యూటన్స్ థర్డ్ లా' ప్రమోషన్లలో భాగంగా మాట్లాడిన సుమంత్, టాలీవుడ్‌లో రికార్డులు సృష్టించిన 'నువ్వే కావాలి', 'దేశముదురు' కథలు మొదట తన వద్దకే వచ్చాయని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు.. డేట్స్ కుదరక 'నువ్వే కావాలి' దర్శకుడు కె. విజయభాస్కర్ తెరకెక్కించిన యూత్‌ఫుల్ సన్సేషన్ 'నువ్వే కావాలి' ఆఫర్ మొదట సుమంత్‌కే వచ్చిందట. ఇక ఆ సమయంలో తాను 'యువకుడు', 'పెళ్లి సంబంధం' సినిమాలతో ఫుల్ బిజీగా ఉండటం వల్ల డేట్స్ అడ్జస్ట్ చేయలేక ఈ సినిమాను వదులుకోవాల్సి వచ్చిందని తెలిపారు. ఆ తర్వాత ఈ సినిమాలో తరుణ్ నటించి ఓవర్‌నైట్ స్టార్ అయిపోయారు. ఇక ఇప్పటికీ ఈ బ్లాక్‌బస్టర్ మూవీ మిస్ అయ్యాననే బాధ తన మనసులో ఉందని సుమంత్ ఓపెన్‌గా చెప్పారు. బన్నీ ఎనర్జీ వల్లే 'దేశముదురు' హిట్: పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో అల్లు అర్జున్ నటించిన మాస్ ఎంటర్‌టైనర్ 'దేశముదురు' స్క్రిప్ట్ కూడా ఫస్ట్ సుమంత్ వద్దకే వచ్చిందట. అయితే "ఆ సినిమా నేను చేసి ఉంటే అంత పెద్ద సక్సెస్ అయ్యేది కాదేమో.. అల్లు అర్జున్ ఉన్న ఫేమ్, ఆయన చూపించిన ఎనర్జీ వల్లే ఆ సినిమా రూ.కోట్ల కలెక్షన్లు రాబట్టింది" అంటూ సుమంత్ చాలా నిజాయితీగా, హుందాగా మాట్లాడటం విశేషం. జులై 31న 'న్యూటన్స్ థర్డ్ లా' ఇక సుమంత్ కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం 'న్యూటన్స్ థర్డ్ లా' విడుదలకు సిద్ధమైంది. ఇక రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌లో జగపతిబాబు, కార్తీక్ రత్నం, రవి వర్మ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. కె. హరీశ్ నిర్మించిన ఈ చిత్రం జులై 31న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఇక దీని తర్వాత 'మహేంద్రగిరి వారాహి' అనే క్రేజీ ప్రాజెక్ట్‌తో ఆయన అలరించనున్నారు. ఇదివరకు సుమంత్‌తో 'సుబ్రమణ్యపురం' తెరకెక్కించిన సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో, 'రంగమార్తాండ' నిర్మించిన మధు కాంబినేషన్‌లో ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్లుగా డివైన్ ఎలిమెంట్స్, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో వస్తున్న ఈ సినిమా ప్రోమోలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి. మొదట రూ. 10 కోట్ల బడ్జెట్‌తో అనుకున్నప్పటికీ, సినిమాలో దాదాపు గంటపాటు ఉండే గ్రాండ్ వీఎఫెక్స్ కారణంగా ఏకంగా రూ. 26 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించడం విశేషం. ప్రమోషనల్ కంటెంట్‌లో కనిపిస్తున్న విజువల్ గ్రాండియర్ చూస్తుంటే ఈ సినిమా సుమంత్ కెరీర్‌లోనే మైలురాయిగా నిలిచేలా కనిపిస్తోంది. కెరీర్‌ను మార్చేసిన నిర్ణయాలు: సినిమా పరిశ్రమలో ఒక నటుడు వదులుకున్న కథలు మరొకరి జీవితాన్ని ఎలా మైలురాళ్లుగా మారుస్తాయో అనడానికి ఈ రెండు సినిమాలే ఉదాహరణ. ఇక ఏది ఏమైనా సుమంత్ కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడిన నిజాయితీని ఫ్యాన్స్ ప్రశంసిస్తున్నారు. మరి జులై 31న రాబోతున్న 'న్యూటన్స్ థర్డ్ లా' సినిమా ఆయనకు ఎలాంటి సక్సెస్ అందిస్తుందో చూడాలి.







